శాస్త్ర సాంకేతిక రంగాల్లో సత్తా చాటుతా!

దేశం మొత్తం మీద ఒక్కరికి మాత్రమే అందించే స్కాలర్‌షిప్ అది.. వేలాది దరఖాస్తులు వస్తాయి, వాటన్నింటినీ దాటుకుని తన ప్రతిభతో ఆ ఉపకార వేతనానికి ఎంపికైంది హైదరాబాద్ బిట్స్ పిలానీ విద్యార్థిని సౌమ్య తివరయ. ఇదెలా సాధ్యమైందో తన మాటల్లోనే...



'ఆకాంక్ష' స్కాలర్‌షిప్ విజేత సౌమ్య

మాది దిల్లీ. నాన్న వ్యాపారం, అమ్మ ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటారు. స్టెమ్ కోర్సులపై చిన్నప్పటి నుంచీ నాకు ఆసక్తి ఎక్కువ. ఆ దారిలోనే ప్రస్తుతం బీఈ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ చదువుతున్నా. ప్రోగ్రెస్ సాఫ్ట్‌వేర్ అనే సంస్థ ఇలా స్టెమ్ కోర్సులు చదివే విద్యార్థినికి ఏటా స్కాలర్‌షిప్ ఇస్తుందని తెలిసి 'ఆకాంక్ష' కార్యక్రమానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేశా. అంతమందిలో నన్ను ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇది నా చదువుకయ్యే ఖర్చులకే కాదు, తర్వాత కాలంలో కెరియర్‌కు కూడా సాయపడుతుంది. ఈ స్కాలర్‌షిప్‌ను స్టెమ్ కోర్సుల్లో అండర్‌గ్రాడ్యుయేట్‌గా ఉన్న విద్యార్థినికి ఇస్తారు. మన దేశంలో ఒక్కరికి మాత్రమే ఇది లభిస్తుంది.

> ఈ స్కాలర్‌షిప్ ద్వారా ఏడాదికి రూ.లక్షన్నర వరకూ గ్రాంటు లభిస్తుంది. స్టెమ్ కోర్సుల్లో అండర్‌గ్రాడ్యుయేట్‌గా ఉన్న విద్యార్థినికి దీన్ని ఇస్తారు. చదువుకయ్యే ఖర్చులకే కాదు, తర్వాత కాలంలో కెరియర్‌కూ ఇది సాయపడుతుంది.

దీనికోసం పోర్టల్‌లో రెజ్యూమె, లెటర్ ఆఫ్ రికమెండేషన్‌తో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత టెలిఫోన్‌లో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం అమెరికా దేశ ప్రతినిధులతో చర్చ ఉంటుంది. ఈ ప్రక్రియలో మనం చూపిన ప్రతిభ ఆధారంగా వారు అంతిమ నిర్ణయం తీసుకుంటారు. ఈ స్కాలర్‌షిప్ ద్వారా ఏడాదికి రూ.లక్షన్నర వరకూ గ్రాంటు లభిస్తుంది, ట్యూషన్ ఫీజుతోపాటు ఇతర కాలేజీ ఖర్చులను సంస్థ వారు భరిస్తారు. పైగా గుర్తింపు లభిస్తుంది, అయితే ఎంపిక అయిన తర్వాత కూడా విద్యార్థి కనీసం 7.5 గ్రేడ్ పాయింట్లు ఏటా తెచ్చుకుంటూ ఉండాలి.

ఇంటర్న్‌షిప్ చేస్తున్నా

ఇంటిగ్రేటెడ్ డిగ్రీలో మూడో ఏడాది పూర్తిచేస్తున్నా. ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్)లో ఇంటర్న్‌షిప్ కూడా చేస్తున్నా. టెక్ పరిశ్రమకు సంబంధించి అవగాహన పెరిగేందుకు ఈ ఇంటర్న్‌షిప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ రంగంలో నూతన ఆవిష్కరణలు చేసేందుకు ఇప్పటికే పలు బృందాలతో కలిసి పనిచేశా. అదే దారిలో సీఎంఎస్ వెబ్ పోర్టల్‌లో పనిచేస్తూ కోడింగ్ అనుభవం లేకపోయినా కొత్త వెబ్‌సైట్లను తయారుచేయడంపై కృషిచేశాను. దీని ద్వారా కార్పొరేట్ ఉద్యోగ జీవితం ఎలా ఉంటుందో, పరిశ్రమ అవసరాలు ఏంటో, ఇంకా చాలా కొత్త విషయాలు తెలుసుకున్నా.

ఏఐఎంల్‌పై ఆసక్తి

చిన్నతనం నుంచి నాకు శాస్త్రసాంకేతిక రంగాలపై ఆసక్తి ఎక్కువ. కొత్తగా ఏదైనా కనిపెట్టాలనే కుతూహలం ఉండేది. కాలేజీలో చేరాక అధ్యాపకుల సహకారంతో వివిధ ప్రాజెక్టుల్లో వారితో కలిసి పనిచేశాను. ఆ సమయంలోనే నాకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్) రంగాలపై ఆసక్తి ఉందని గమనించాను. ఇందులో మరిన్ని ఉన్నత చదువులు చదవాలని ప్రయత్నిస్తున్నా. మెషిన్‌లెర్నింగ్‌ను ఆరోగ్యరంగానికి అనుసంధానిస్తూ పరిశోధనలు చేయడమే నా ముందున్న లక్ష్యం. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో మరిన్ని ఆవిష్కరణలు అవసరం. ఇందుకోసం నా వంతు ప్రయత్నం చేస్తాను. ఇప్పటికే ఇందుకు సంబంధించి పలు కోర్సులు చేశాను. అలా నేర్చుకోవడం వల్ల నాపై నాకు నమ్మకం కలిగింది.

మొదట ఈ రంగం ఎంచుకునేటప్పుడు నాకిది సరైనదా కాదా అనే సందిగ్ధత కొంత ఉండేది. కానీ కోర్సులో చేరి చదవడం మొదలుపెట్టాక రిసెర్చ్ పేపర్లు అవీ చదువుతూ ఉంటే ఎంతో ఆసక్తిగా ఉండేది. అప్పుడే అర్థమైంది- నాకిది సరిపోతుందని. కుటుంబం, అధ్యాపకుల సహకారంతో ఇంకా బాగా నేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నా. తరగతి గది పాఠాలతో పాటు ఇతర కార్యక్రమాలపైనా దృష్టి పెట్టేటప్పుడు కొంత ఒత్తిడి సహజం. కొన్నిసార్లు మనం అనుకున్న మార్గంలో పయనించడం కష్టమవుతుంది, చాలామంది ప్రశ్నిస్తారు, మన మీద మనకే నమ్మకం కోల్పోయే సందర్భాలు సైతం ఉంటాయి.. కానీ వాటన్నింటినీ తట్టుకుని నిలబడినప్పుడే అనుకున్నది చేయగలం. ఒక్కసారి మనసుకు ఇది సరైనదనిపిస్తే వెనక్కి తిరిగి చూసుకోకుండా ప్రయత్నించడమే మంచిది.

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ) 2100 ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. 800 జూనియర్ అసిస్టెంట్ మేనేజర్, 1300 ఎగ్జిక్యూటివ్- సేల్స్ అండ్ ఆపరేషన్స్ పోస్టులు ఉన్నాయి. డిగ్రీ విద్యార్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైతే ఆకర్షణీయ వేతనంతో ఉద్యోగం సొంతమవుతుంది!

2100 కొలువులు

ఉద్యోగార్థులకు ఐడీబీఐ ఆహ్వానం!

ఐడీబీఐ పోస్టులకు జనరల్ అభ్యర్థులు పోటీ పడటానికి గరిష్ఠ వయసు 25 ఏళ్లు మాత్రమే. ఐబీపీఎస్ ద్వారా జరిగే బ్యాంకు పీవో పోస్టులకు మాత్రం అన్ రిజర్వ్‌డ్ వర్గాలకు 30 ఏళ్ల వరకు అవకాశం ఉంటుంది. అందువల్ల ఈ పరీక్షకు పోటీ కొంచెం తక్కువగానే ఉంటుంది. అలాగే డిస్క్రిప్టివ్ పరీక్ష కూడా లేకపోవడం కలిసొచ్చే అంశమే. ఎగ్జిక్యూటివ్- సేల్స్ అండ్ ఆపరేషన్స్ ఖాళీలను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారు. అయితే వీరి పనితీరు ప్రకారం రెండేళ్ల తర్వాత శాశ్వత ప్రాతిపదికన విధుల్లోకి తీసుకోవచ్చు. రెండు పోస్టులకూ.. ఆన్‌లైన్ పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ప్రి రిక్రూట్‌మెంట్ మెడికల్ టెస్టులతో నియామకాలుంటాయి. జూనియర్ అసిస్టెంట్ మేనేజర్లకు మాత్రం ఇంటర్వ్యూ అదనం.

ఆన్‌లైన్ పరీక్ష

రెండు పోస్టులకూ పరీక్ష విధానం ఒక్కటే. మొత్తం 200 ప్రశ్నలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున వీటికి 200 మార్కులు. పరీక్ష వ్యవధి 2 గంటలు. తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్‌లో 60, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40, జనరల్/ ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్/ కంప్యూటర్/ ఐటీ విభాగంలో 60 ప్రశ్నల చొప్పున వస్తాయి. వీటిని ఆబ్జెక్టివ్ తరహాలోనే అడుగుతారు. ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ప్రశ్నలుంటాయి. సెక్షన్ల వారీ సమయ నిబంధన లేదు.

ఇంటర్వ్యూ, తుది ఎంపిక

ఆన్‌లైన్ పరీక్షలో సెక్షన్లవారీ, మొత్తం మీద కనీస మార్కులు పొందాలి. ఇలా అర్హులైనవారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ ప్రకారం విభాగాల వారీ ఒక్కో ఖాళీకి కొంతమందిని చొప్పున ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు. ఈ సంఖ్యను ఐడీబీఐ నిర్ణయిస్తుంది.

ఇంటర్వ్యూకి వంద మార్కులు. ఇందులో 50 మార్కులు పొందడం తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు 45 మార్కులు రావాలి. ఇంటర్వ్యూలో అర్హత మార్కులు పొందినవారు పరీక్షలో సాధించిన మార్కుల్లో 3/4 వంతు, ఇంటర్వ్యూ స్కోరులో 1/4 వంతు మార్కులు కలిపి మెరిట్ జాబితా రూపొందించి, ఉద్యోగానికి తీసుకుంటారు.

ఎగ్జిక్యూటివ్ పోస్టులకు మాత్రం పరీక్షలో చూపిన ప్రతిభతో ధ్రువ పత్రాలను పరిశీలించి, వైద్య పరీక్షలు నిర్వహించి తుది నియామకాలు చేపడతారు.

వేతనం

జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్ 'ఓ'కు ఎంపికైనవారికి క్లాస్ ఏ సిటీలో అయితే ఏడాదికి రూ.6.14 లక్షల నుంచి రూ.6.50 లక్షలు అందుతుంది. వీరు ఏడాది పాటు ప్రొబేషన్‌లో ఉంటారు. మూడేళ్ల సర్వీస్‌తో గ్రేడ్ 'ఏ' హోదా పొందుతారు. అదే ఒప్పంద ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ సేల్స్ అండ్ ఆపరేషన్స్‌లో చేరినవారికి మొదటి ఏడాది ప్రతి నెలా రూ.29,000, రెండో ఏట రూ.31,000 చొప్పున చెల్లిస్తారు. అయితే రెండేళ్ల సేవలు అనంతరం వీరిని కూడా జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్ 'ఓ' పోస్టులకు ఎంపిక చేయడానికి అవకాశం ఉంది. బ్యాంకు నిర్వహించే ఎంపిక పరీక్షలో విజయవంతమైతే వీరినీ శాశ్వత ప్రాతిపదికన విధుల్లోకి తీసుకుంటారు.

ముఖ్య వివరాలు

ఖాళీలు: జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ 800. (అన్ రిజర్వ్‌డ్ 324, ఓబీసీ 216, ఎస్సీ 120, ఎస్టీ 60, ఈడబ్ల్యుఎస్ 80). ఎగ్జిక్యూటివ్ సేల్స్ అండ్ ఆపరేషన్స్ 1300. (అన్ రిజర్వ్‌డ్ 558, ఓబీసీ 326, ఎస్సీ 200, ఎస్టీ 86, ఈడబ్ల్యుఎస్ 130).
విద్యార్హత: జూనియర్ అసిస్టెంట్ మేనేజర్లకు 60 (ఎస్సీ, ఎస్టీలైతే 55) శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉండాలి. ఎగ్జిక్యూటివ్ సేల్స్ అండ్ ఆపరేషన్స్ పోస్టులకు డిగ్రీ ఉత్తీర్ణులైతే సరిపోతుంది.
వయసు: నవంబరు 1, 2023 నాటికి 20 - 25 ఏళ్ల లోపు ఉండాలి. అంటే నవంబరు 2, 1998 - నవంబరు 1, 2003 మధ్య జన్మించినవారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 6
ఆన్‌లైన్ పరీక్ష తేదీ: జూనియర్ అసిస్టెంట్ మేనేజర్లకు డిసెంబరు 31. ఎగ్జిక్యూటివ్ సేల్స్ అండ్ ఆపరేషన్స్ పోస్టులకు డిసెంబరు 30.
ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు: ఏపీలో.. చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం. తెలంగాణలో.. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.200. మిగిలిన అందరికీ రూ.1000
వెబ్‌సైట్: https://ibpsonline.ibps.in/idbiesonov23/

ఇదీ సిలబస్

లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్: నాన్ వెర్బల్ సిరీస్, అనాలజీ, కోడింగ్-డీకోడింగ్, ఆడ్‌మన్ అవుట్, క్లాక్, క్యాలెండర్, రక్త సంబంధాలు, దిక్కులు, క్యూబ్స్, డైస్, వెన్ చిత్రాలు, కౌంటింగ్ ఫిగర్స్, పజిల్స్, సిలాజిజమ్, ర్యాంకింగ్, సీక్వెన్స్, సింబాలిక్ ఆపరేషన్స్, నెంబర్ ఎనాలజీ, ఫిగర్ ఎనాలజీ, వెన్ డయాగ్రమ్స్, నంబర్ క్లాసిఫికేషన్, సిరీస్, వర్డ్ బిల్డింగ్... తదితర విభాగాల్లో ప్రశ్నలు వస్తాయి. ఎక్కువ ప్రశ్నలు తర్కంతో ముడిపడి ఉంటాయి. వీటికి సమాధానం గుర్తించాలంటే గణితంలోని ప్రాథమికాంశాలపై అవగాహన ఉండాలి. వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించాలి.

జనరల్/ ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్/ కంప్యూటర్/ ఐటీ: బ్యాంకులు, ఆర్థిక వ్యవహారాలకు ఎక్కువ ప్రాధాన్యం. అందువల్ల.. ఆర్‌బీఐ, బ్యాంక్ పదజాలం, బీమా, రెపో, రివర్స్ రెపో, వడ్డీరేట్లు, బ్యాంకుల కార్యకలాపాలు, బ్యాంకుల విలీనం, తాజా ఆర్థిక నిర్ణయాలు, బ్యాంకులు-ప్రధాన కార్యాలయాలు-అధిపతులు.. ఇవన్నీ తెలుసుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో భాగంగా రోజువారీ సంఘటనలే (వర్తమాన వ్యవహారాలు) ప్రశ్నలుగా వస్తాయి. దేశ చరిత్ర, సంస్కృతి, భూగోళం, పాలిటీ, సైన్స్‌ల్లో ప్రాథమిక అవగాహనను పరిశీలిస్తారు. నియామకాలు, అవార్డులు, విజేతలు, ఎన్నికలు, పుస్తకాలు-రచయితలు, ప్రముఖుల పర్యటనలు, మరణాలు..ఈ అంశాలకు ప్రాధాన్యమివ్వాలి. ఎకనామిక్స్‌లో ప్రాథమికాంశాలు చదువుతూ, ఆర్థిక ఒప్పందాలపై అవగాహన పెంచుకోవాలి. కంప్యూటర్/ఐటీలకు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం తప్పనిసరి. బ్యాంకు కార్యకలాపాలకు అవసరమయ్యే కనీస సాంకేతిక పరిజ్ఞానం ఉందో, లేదో పరిశీలిస్తారు.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: శాతాలు, నిష్పత్తి-అనుపాతం, లాభ-నష్టాలు, చక్రవడ్డీ, బారువడ్డీ, కాలం-దూరం, కాలం-పని, పడవలు-ప్రవాహాలు, రైళ్లు, సరాసరి, వ్యాపార భాగస్వామ్యం ఇలా ప్రతి అంశం నుంచి ఒక ప్రశ్న వస్తుంది. సమాధానం త్వరగా గుర్తించడానికి లాజిక్, షార్ట్ కట్స్ ఉపయోగించాలి. వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయడం ద్వారా జవాబు త్వరగా గుర్తించే నైపుణ్యం సొంతమవుతుంది.

ఇంగ్లిష్ లాంగ్వేజ్: వ్యాకరణంపై అవగాహన పెంచుకోవాలి. వేగంగా చదివి, సమాచారాన్ని సంగ్రహించే నైపుణ్యాలు పెంపొందించుకుంటే కాంప్రహెన్షన్‌లో ఎక్కువ మార్కులు పొందవచ్చు. ఆంగ్ల దినపత్రికలు చదవడం, వార్తలు వినడం ద్వారా భాషపై పట్టు పెంచుకోవడానికి ప్రయత్నించాలి. కాంప్రహెన్షన్, క్లోజ్ టెస్టు, జంబుల్డ్ సెంటెన్స్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్/కరెక్షన్ నుంచి కొన్ని, వ్యాకరణాంశాల నుంచి వర్డ్ సబ్‌స్టిట్యూషన్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, సిననిమ్స్-యాంటనిమ్స్, వాయిస్, డైరెక్ట్, ఇండైరెక్ట్ స్పీచ్‌ల్లో ప్రశ్నలు అడుగుతారు.



సన్నద్ధత ఇలా..

పరీక్షకు సుమారు 33 రోజుల వ్యవధే ఉంది. ఈ తక్కువ సమయం ఇప్పటికే బ్యాంకు పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారికి మంచి అవకాశం.

- ఇటీవలే గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన తాజా అభ్యర్థులు ముందుగా పరీక్షలో పేర్కొన్న విభాగాలకు సంబంధించి ప్రాథమికాంశాలతో అధ్యయనం ప్రారంభించాలి. అనంతరం ఎక్కువ మార్కులు సాధించడానికి అనువైన అంశాలను పూర్తిచేసుకోవాలి. ఆ తర్వాత మిగిలిన అంశాలు అధ్యయనం చేయాలి.
- పరీక్షలో ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ విభాగాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- విభాగాల వారీ ఉన్న అంశాలను 23 రోజుల్లో పూర్తిచేసుకోవాలి. చివరి పది రోజులు మాక్ టెస్టులకు కేటాయించాలి. ఐబీపీఎస్, ఎస్‌బీఐ పీవో పాత ప్రశ్నపత్రాలనూ బాగా సాధన చేయాలి.
- 200 ప్రశ్నలకు 120 నిమిషాలు అంటే ప్రతి ప్రశ్నకూ కేవలం 36 సెకన్ల వ్యవధే ఉంటుంది. రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లకు ఈ సమయం సరిపోదు. అందువల్ల ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్ విభాగాలను వీలైనంత తక్కువ వ్యవధిలో పూర్తిచేసి, అక్కడ మిగుల్చుకున్న సమయాన్ని ఈ విభాగాలకు కేటాయించగలిగితేనే ఎక్కువ ప్రశ్నలకు జవాబులు గుర్తించగలరు.
- మాక్ టెస్టులతో పరీక్ష విధానానికి అలవాటు పడటమే కాకుండా నిర్ణీత సమయంలో ఏ విభాగంలో ఎన్ని ప్రశ్నలు సాధించగలుగుతున్నారో తెలుస్తుంది. దాని ప్రకారం ఎంత వేగంతో సమాధానం ఇవ్వాలో అర్థం చేసుకుని, సన్నద్ధత మెరుగుపరచుకోవాలి.
- సమాధానం రాబట్టడానికి ఎక్కువ సమయం తీసుకునే విభాగం/ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. అలాగే ఎక్కడ తప్పులు చేస్తున్నారో గుర్తించి, వాటిని తర్వాత పరీక్షలో పునరావృతం కాకుండా చూసుకోవాలి. ఇలా విశ్లేషించుకుంటూ పరీక్షకు సిద్ధమైతే తక్కువ వ్యవధిలోనే అంశాలు, సమయ పాలనపై పట్టు సాధించవచ్చు.
- రుణాత్మక మార్కులు ఉన్నందున ఏ మాత్రం తెలియని ప్రశ్నను వదిలేయడమే మంచిది.

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

సాయుధ బలగాల్లో 26,146 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా వివిధ కేంద్ర సాయుధ బలగాల్లో 26,146 కానిస్టేబుల్/ రైఫిల్‌మ్యాన్ పోస్టులు భర్తీ కానున్నాయి.

1. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్): 6,174 (పురుషులు- 5,211; మహిళలు- 963)
2. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్): 11,025 (పురుషులు- 9,913; మహిళలు- 1,112)
3. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్): 3,337 (పురుషులు- 3,266; మహిళలు- 71)
4. సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ): 635 (పురుషులు- 593; మహిళలు- 42)
5. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ): 3,189 (పురుషులు- 2,694; మహిళలు- 495)
6. అస్సాం రైఫిల్స్ (ఏఆర్): 1,490 (పురుషులు- 1,448; మహిళలు- 42)
7. సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్ (ఎస్ఎస్ఎఫ్): 296 (పురుషులు- 222; మహిళలు- 74)

అర్హతలు: గుర్తింపు పొందిన బోర్డు/ యూనివర్సిటీ నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతి. పురుష అభ్యర్థుల ఎత్తు 170 సెం.మీ.లకు, మహిళా అభ్యర్థులకు 157 సెం.మీ.లకు తగ్గకూడదు.
వయసు: జనవరి 01, 2024 నాటికి 18 నుంచి 23 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు సడలింపు ఉంటుంది.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, వైద్య పరీక్షల ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.100 (మహిళలు/ ఎస్సీ/ ఎస్టీ/ మాజీ సైనిక అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది).
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31-12-2023.
వెబ్‌సైట్: https://ssc.nic.in/

వాక్-ఇన్స్

బెంగళూరులో టీచింగ్ ఉద్యోగాలు

బెంగళూరు, రాజాజీనగర్‌లోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) మెడికల్ కాలేజ్ అండ్ పీజీఐఎంఎస్ఆర్ హాస్పిటల్... ఒప్పంద ప్రతిపాదికన 7 టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ప్రొఫెసర్: 01
- అసోసియేట్ ప్రొఫెసర్: 05
- అసిస్టెంట్ ప్రొఫెసర్: 01

విభాగాలు: ఆర్థోపెడిక్స్, రేడియో-డయాగ్నోసిస్, ఎమర్జెన్సీ మెడిసిన్, ఆప్తల్మాలజీ, జనరల్ మెడిసిన్, పాథాలజీ.
అర్హత: మెడికల్ పీజీ.
వయసు: 67 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు ప్రొఫెసర్‌కు రూ.2,39,607, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,59,334, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,36,889
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
ఇంటర్వ్యూ తేదీ: 01-12-2023.
వేదిక: న్యూ అకడమిక్ బ్లాక్, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ అండ్ పీజీఐఎంఎస్ఆర్, రాజాజీనగర్, బెంగళూరు.

జూనియర్ రెసిడెంట్లు

బెంగళూరు రాజాజీనగర్‌లోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) మెడికల్ కాలేజ్, పీజీఐఎంఎస్ఆర్ అండ్ మోడల్ హాస్పిటల్... ఒప్పంద ప్రతిపాదికన 6 జూనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: ఎంబీబీఎస్. **వయసు:** 30 ఏళ్లు మించకుడదు.
వేతనం: నెలకు రూ.1,10,741
ఇంటర్వ్యూ తేదీ: 05-12-2023.
వేదిక: ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్, పీజీఐఎంఎస్ఆర్ అండ్ మోడల్ హాస్పిటల్, రాజాజీనగర్, బెంగళూరు.
వెబ్‌సైట్: https://www.esic.gov.in/recruitments

ఈవినింగ్ కాలేజీలో చేరొచ్చా?

మా అమ్మాయికి బీఈ (సివిల్) రెండో సంవత్సరం చదివాక కేంద్ర ప్రభుత్వ కొలువు వచ్చింది. ఉద్యోగం చేస్తూ బీఈ మూడో సంవత్సరం ఈవినింగ్ కాలేజీలో చదివే అవకాశం ఉందా? - ఎల్.సమ్మయ్య నాయక్

■ అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ప్రస్తుత నిబంధనల ప్రకారం ఇంజినీరింగ్ కోర్సును దూరవిద్య ద్వారా చదవడం కుదరదు. కానీ, మూడు సంవత్సరాల డిప్లొమాతో ఉద్యోగం చేస్తున్నవారు మాత్రం ఈవినింగ్ కళాశాల్లో ఇంజినీరింగ్ కోర్సు చదవొచ్చు. మీ అమ్మాయి పదో తరగతి/ ఇంటర్మీడియట్ తరువాత డిప్లొమా చదివి ఉండకపోతే ఈవినింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ చదివే అవకాశం లేదు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ వారి ఏఎంఐఈ (అసోసియేట్ మెంబర్ ఆఫ్ ద ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్) పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే ఆ సర్టిఫికెట్ ఇంజినీరింగ్ డిగ్రీకి సమానం అవుతుంది. కాకపోతే, ఆ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం చాలా తక్కువ. మీ అమ్మాయిని బీఈ/ బీటెక్ మాత్రమే చదివించాలి అనుకొంటే, బీఎస్సీని మ్యాథ్స్/ ఫిజిక్స్‌లతో పూర్తి చేసి, బిట్స్ పిలానీ వారి వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రాం (విల్ప్) ద్వారా బీటెక్ చేసే వీలుంది. దూరవిద్యలో బీఎస్సీ తరువాత, ఎమ్మెస్సీ(మ్యాథ్స్/ ఫిజిక్స్) చేసి బిట్స్ విల్ప్ ద్వారా ఎంటెక్ చేసే అవకాశమూ ఉంది. ప్రస్తుతం తను ఉద్యోగం చేస్తున్న సంస్థ నుంచి రెండు సంవత్సరాల సెలవు తీసుకొని, తను గతంలో చదివిన ఇంజినీరింగ్ కళాశాల నుంచి మిగిలిన రెండు సంవత్సరాల కోర్సును పూర్తిచేసే అవకాశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోండి.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో రిజిల్ సంస్థ

1.కంటెంట్ మేనేజ్‌మెంట్

స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: నవంబరు 29, 2023 **అర్హతలు:** ఇంగ్లిష్ రాయడం, వీడియో మేకింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/9ae9f0

2.మార్కెటింగ్

స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: నవంబరు 30, 2023 **అర్హతలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటంలో నైపుణ్యం
☛ internshala.com/i/8edf65

హార్టికల్చరిస్ట్

సంస్థ: అపర్డబుల్ ఆర్గానిక్ స్టోర్
స్టైపెండ్: నెలకు రూ.8,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 2, 2023 **అర్హతలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఆఫీస్, ఇంగ్లిష్ మాట్లాడటంలో నైపుణ్యం
☛ internshala.com/i/9ab179

ఈ-కామర్స్ ఆపరేషన్స్

సంస్థ: పాల్క్ స్ట్రీట్ **స్టైపెండ్:** నెలకు రూ.12,000-15,000 **దరఖాస్తు గడువు:** నవంబరు 30, 2023 **అర్హతలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ నైపుణ్యం
☛ internshala.com/i/fe15aa

కస్టమర్ సపోర్ట్

సంస్థ: ఐబీ క్రికెట్ **స్టైపెండ్:** నెలకు రూ.15,000-25,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 1, 2023 **అర్హతలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ రాయడంలో నైపుణ్యం ☛ internshala.com/i/188739